# మా రాధ కథ

రాధకి పెళ్ళయింది. మొగుడు రాజయ్య ఏదో సినిమాహాలులో పనిచేస్తున్నాడు నెలకి నూటయాభై రూపాయలు జీతం. బాగానే ఉందనుకుని సంతోషించాను నేనే కాదు, మా ఇంటిలో వాళ్ళూ మాయింటికొచ్చే వాళ్ళూ. రాధని తెలిసిన వాళ్ళంతా ఆమాటే అన్నారు, "రాధకేం మమ్మీ హాయిగా మొగుడు సినిమాలకి తీసుకెళుతూ వుంటాడు. ...ఫ్రీ... కదా" అంటూ ఏడిపించారు పిల్లలు. వారిలా అంటున్నప్పుడల్లా సిగ్గుపడి పోయేది అది. అదలా సిగ్గుపడుతూ వుంటే చెప్పొద్దూ, నాకూ ఏడిపించాలనే వుండేది. నేను ఆ మాట అనేసరికి, దాని మొహం ఎరుపెక్కిపోయేది. నాకేసి చూట్టానికి సిగ్గుపడి తల ప్రక్కకు తిప్పుకునేది.

రాధ వెళ్ళిపోయాక నాకు చెయ్యి విరిగినట్టనిపించింది. ఏ పని చేసినా, అదే జ్ఞాపకం వచ్చేది. దాన్ని తలుచుకోని క్షణంలేదు. నేనేదైనా పనిచేద్దామని వెళితే నా చేతిలోని పని లాక్కుని అది చేసేది. దానికి రాని పనంటూలేదు. మహా పనిమంతురాలు. అస్తమానం దాన్ని చూసి అనుకునే

దాన్ని -'రాధ ఎవరింటిలో పడుతుందో కాని, వాళ్ళు చాలా అదృష్టవంతులు అని."

○ ○ ○ ○ ○ ○

రాధ మా యింటికొచ్చినప్పుడు దానికి పదేళ్ళుంటాయి వాళ్ళ నాన్న మల్లయ్య మావారి ఆఫీసులో అటెండరుగా పనిచేసేవాడు. హఠాత్తుగా గుండె జబ్బొచ్చి మంచం పట్టాడు. ఇల్లు గడపడం కష్టమైపోయింది. భార్య చంద్రమ్మ ఒకళ్ళింట్లో నౌఖరీకి కుదిరింది. ఎనిమిదేళ్ళ కొడుకుని పెట్రోల్ బంకులో కుదిర్చారు మావారు. రాధని మా ఇంట్లోనే వుండమన్నాను. ఆదివారాలు మాత్రం వాళ్ళింటికెళ్ళి వస్తూవుండేది.

రాధని పనిలోకి పెట్టుకున్నప్పుడు, ఇది పనిచెయ్యగలదా? అనుకున్నాను. పిల్లల్ని స్కూల్లో దింపడం, తీసుకురావడం, అన్నం పట్టుకెళ్ళడం, పిల్లల బట్టలుతకడం, చిన్నచిన్న బజారుపన్లు వగైరాలు. సరే కానీలే నేర్పించిచూద్దాం అనుకుని రాజీ పడ్డాను.

ఆరోజు నేను పడుకున్నాను. గణగణమని టెలీఫోను మోగింది. విసుక్కుంటూ లేవబోయాను నిద్రచెడగొట్టిన ప్రబుద్ధులెవరా అనుకుంటూ. అంతలో "హల్లో...షి...ఈజ్...స్లీపింగ్...రింగ్...ఆఫ్...ఆఫ్టర్...సమ్...టైమ్" అని చెబుతున్న రాధకేసి చూస్తూ ఉండిపోయాను ఆశ్చర్యంతో. నేను విన్నానని తెలిసి మహా సిగ్గుపడిపోయింది రాధ.

"ఎప్పుడు నేర్చుకున్నావే ఇంగ్లిషు" ఆశ్చర్యంలోంచి తేరుకుని అడిగాను. నవ్వుతూ అక్కడినుంచి వెళ్ళిపోయింది.

అలా ఇంగ్లీషులో చిన్నచిన్న వాక్యాలు మాట్లాడటం నేర్చుకుంది రాధ. అది మాట్లాడుతుంటే మా యింటిల్లిపాదీ ఆనందించేవారు. బహుశ

దానికది ప్రోత్సాహంగా వుండేదేమో. మెల్లమెల్లగా ఎబీసీడీలు వ్రాయడం, దాని పేరు వ్రాయడం నేర్చుకుంది.

'రింగర్...రింగర్ ...రోజెస్...' అంటూ పిల్లలతోపాటు ఆడేది. ఇలా దాని తెలివితేటలు నానాటికీ వికసించాయి.

పైగా అది మాతోపాటు ఎక్కడికెళితే అక్కడికి వచ్చేది. మేము మాట్లాడుతుంటే వినడంవల్ల ఒక రకమైన సంస్కారం కూడా అబ్బింది దానికి. అనవసరంగా మాట్లాడేది కాదు.

మా పిల్లలకి పనికిరావనుకునే పరికిణీలూ అవీ దానికిచ్చేదాన్ని కాబట్టి దాని వేషభాషలు రెండూ ఇంపుగానే వుండేవి. ఒకసారి అది నాతో మద్రాస్ వచ్చింది. పిల్లలతోపాటు ఆడుకుంటున్న దాన్ని చూసి ఎవరో "ఇది మీ పెద్దమ్మాయా?" అని అడిగారు నన్ను. కొంచెం తడబడ్డా. వెంటనే "అవును" అన్నాను. ఆ మాట విన్న రాధ నాకేసి చూసి నవ్వింది. ఆ కళ్లలో తృప్తి తళుక్కున మెరుస్తూ కనిపించింది నాకు.

అటువంటి రాధ పెళ్ళయి వెళ్ళిపోతూవుంటే, మా యింటిల్లిపాదికీ కళ్లల్లో నీళ్ళు తిరిగాయి. నాకేదో నా కూతుర్ని అత్తారింటికి పంపేస్తున్నట్టే అనిపించింది. అందరం పెళ్ళికి వెళ్ళాము. దాని సంసారానికి కావలసిన గిన్నెలేవో కొనిచ్చాను. ఒక మంచి చీర కూడా దానికి బొట్టుపెట్టి ఇచ్చాను. నేను వచ్చేస్తుంటే దాని కళ్ళలో నీళ్ళు నిండాయి. కనుమరుగయ్యేదాకా నాకేసిచూస్తూ చెయ్యూపుతూనే ఉంది.

o o o o o o o o o o

రాధలేనియిల్లు బోసిపోయినట్టనిపించింది. కొన్నాళ్ళదాకా, దాన్ని తలచుకుంటూ ఏదో బాధపడేదాన్ని. ముఖ్యంగా పనున్నప్పుడు నిమిషానికి

లక్షసార్లు జ్ఞాపకానికి వచ్చేది. నేను గంటలో చేసేపని అది చిటికలో ఎలా చేసేదో నా కర్థమయ్యే ది కాదు. ఏది ఏమైతేనేం? అది వెళ్ళిపోయినా, దాని పేరు మాత్రం నా నోటిలోనించి అస్తమానం వస్తూనే వుండేది.

ఒకనాడు మధ్యాహ్నం భోజనంచేసి పుస్తకం చదువుతూ కూర్చున్నాను. రాధ పరిగెత్తుకుంటూవచ్చి నాకాళ్ళమీద పడింది వెక్కి వెక్కి ఏడుస్తూ. "ఏమయి దే" అన్నాను కంగారుగా.

జవాబు చెప్పకుండా ఏడుస్తూనేవుంది. నన్ను చూశాక దాని దుఃఖం మరీ ఎక్కువయింది. అయినవాళ్ళను చూస్తే గుండెపగిలి చెరువై వస్తాయేమో కన్నీళ్ళు. దాని హృదయభారం తగ్గేదాక ఏడవమని ఊరుకున్నాను. ఎందుకో దాన్ని చూస్తుంటే నాకూ ఏడుపొచ్చింది. మనిషి బాగా చిక్కిపోయింది. నల్లబడింది. తలకి నూనెలేదేమో. జుట్టుఎగిరిపోతోంది. మొహం పీక్కుపోయింది. కాసేపయిన తరవాత రాధ చెప్పిన కథ ఇది:

దాని అత్తగారు పరమ గయ్యాళిట. ఆరుగురు మరుదులూ, ఒక బావగారు అందరూ దీన్ని సాధింపులేనట. అత్తగారు దీనికి తిండి సరిగా పెట్టదుసరిగదా గుడ్డలు కూడా సరిగా కట్టుకోనివ్వదు. దీని చీరలన్నీ ఆమే కట్టుకుంటుందిట. దమ్మిడీ దగ్గరుంచదు వంటంతా చేశాక తినడానికి మిగలను. పెళ్ళిలో పుట్టింటివారు పెట్టిన కమ్మలు దుద్దులూ కూడా తాకట్టు పెట్టిందట. ఆ రోజు కూరలో కొంచెం ఉప్పుఎక్కువయిందని కొట్టిందట. దుఃఖం పట్టలేక నా దగ్గర కొచ్చేసింది.

"మరి నీ మొగుడు ఏమీ అనడే?" అన్నాను ఏమనాలో తోచక.

"ఆయన భయపడ్తాడు అమ్మంటే. నాకర్మ ఇంకా ఏమన్నా అంటే నన్నే తిడ్తాడు" అంది కళ్ళొత్తుకుంటూ.

కాస్సేపు దాన్ని ఊరడించి కబుర్లు చెప్పి భోజనం పెట్టాను. దాని మొహంలో మామూలు నవ్వు కనిపించింది. ఏమే మొగుడితో ఇంగ్లీషు మాట్లాడుతున్నావా?" అన్నాను, నవ్వుతూ. దాని మొహంలో విషాదఛాయలు కమ్ముకున్నాయి. "ఆయన కర్థం కాదు" అంది మెల్లిగా, బాధపడ్తున్నట్టుగా. "పోనీలేవే చక్కగా తెలుగులోనే మాట్లాడుకోండి హాయిగా" అన్నాను. "మాటాడినట్టే వుంది. ఆయనకు ఏది తెల్వదు. ఎట్లా పని చేస్తున్నాడో ఏమో? మీ ఇండ్లలోలాగ మమ్మల్ని మాట్లాడుకోనియ్యరు అసలు మా వాళ్ళు" అంది నిరుత్సాహంగా రాధ.

అంతవరకు మామూలుగా వింటున్న నాకు తలపైన పిడుగుపడ్డట్టనిపించింది. నేనే ఏదో తప్పుచేసినట్టు ఫీలయ్యాను. దానికి చదువుమీద ఆసక్తి కలిగించాను. ఆటల్లో పాటల్లో అది మా పిల్లలతో సమానంగా వుంటే ప్రోత్సహించాను. నాతో పాటు ఊళ్ళుతిప్పి నేనేది తింటే అది తినిపించాను. హెచ్చు తగ్గులు కులమతాలు అనే తేడా వుండకూడదనుకుని ప్రగతి కావాలనికోరుకుంటూ దీన్నయితే చూడగలిగాను గాని, దాని పెద్దల సంగతేమిటి? ఆచారం సంప్రదాయం పెళ్ళి అన్ని వారిష్టాలే! వారి అర్హతకు తగ్గవాళ్ళని చూసి పెళ్ళిళ్ళు జరుగుతాయి జీవితాలు సాగుతాయి కేవలత జీతం రాళ్ళకోసం నాదగ్గరుంది కాని ప్రగతికోసం కాదుగా" ఈ ఆలోచ రాగానే తల తిరిగినట్లయింది.

"రాధ మా ఇంటిలో ఉండి ఒక రకమైన సుఖాలనుభవించింది. ఒక రకమైన సంస్కృతికి అలవాటుపడి ఉన్నతంగా బతికాక మళ్ళీ మామూలుగా వాళ్ళ ఇంటిలో ఆ పరిస్థితుల్లో ఇమడలేక పోయింది. అందుకే

దానికి ఆ బ్రతుకు పంజరంలా అనిపిస్తోంది. మా ఇంటో ఉన్న ఆప్యాయత దానికి కరువపోయియింది" ఆలోచిస్తున్న కొద్దీ నేనే తప్పుచేస్తున్నట్టు అని పించింది.

"కాని నా దగ్గరున్నప్పుడు దాన్ని నాతో సమానంగా చూడటం తప్పా? నా పిల్లలతో సమానంగా దానికి ప్రేమ పంచడం తప్పా? మానవత్వం ఉండటం తప్పా? ఏది తప్పు?

ఈ సమాజం ప్రతి మనిషికి కూడూగుడ్డా ఎందుకివ్వదు? అవిద్య నెందుకు అంతం చెయ్యరు? అసలు మనిషి మనిషకెందుకు ఊడిగం చెయ్యాలి? ఈ ప్రశ్నలతో బుర్రవేడెక్కి పోయింది.

"పోయొస్తానమ్మా" అంటూ లేచి నిలుచుంది రాధ. "జాగ్రత్తగా వుండు రాధా. పరిస్థితులకు తగ్గట్టుగా మసలుకో! నిరుత్సాహ పడకు. నీ కోరికలు నీ బిడ్డలద్వారా తీర్చుకో. వాళ్ళని నీ యిష్టమొచ్చినట్టు పెంచుకో. కాని వీళ్ళని మార్చడానికి ప్రయత్నించకు. వాళ్ళు మారరు, వాళ్ళకి అర్థం కాదు కూడా. నీకూ మనశ్శాంతి వుండదు" అన్నాను. "సరే!" అంది నవ్వుతూ. నా మనస్సు తేలిక పడింది. గుండెలమీద బరువు దించిన ట్టయింది. హాయిగా నిట్టూర్చాను రాధ వెళ్ళిపోయింది.

రాధ చురుకైనది కనుక చూసిన విషయాన్ని ఇట్టే పసిగట్టేసేది. దానికి తగ్గవరుడు కావాలంటే, వాళ్ల కులంలో, అన్వేషణ కావాలి. ఒక వేళ ఎవరైనా వున్నా బోలెడు కట్నం కావాలి. ఇతర కులాలలోవారిని చేసుకోరు. ఎలా? ఏది దానికి పరిష్కారం? మళ్ళీ ఆలోచనల్లో మునిగి పోయాను. జవాబు దొరకని ప్రశ్నతో అవస్థపడుతూ మనుషులు మారాలి! కుల మతాల సంకుచిత సంప్రదాయాలనుండి బయట పడాలి! ఎలా

సాధ్యం? డబ్బున్నవాళ్ళూ, లేనివాళ్ళూ కూడా ఈ విషయంలో ఒక్కలాగే ప్రవర్తిస్తున్నారు. "ఇలా ఆలోచనల్లో మునిగిపోయిన నేను ఎప్పుడు నిద్రపోయానో తెలీదు. కలలో మాత్రం రాధ జీవితం హాయిగా పిల్లాపాపల్తో ఆనందంగావుంది. రాధ పిల్లలు కాన్వెంట్‌లో చదువుతున్నారు. రాధకి మంచి ఇల్లూ వాకిలీ ఉన్నాయి. కళ్ళుతెరిచి తృప్తిగా నవ్వుకున్నాను.